క్లుప్తంగా

రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తప్పనిసరి: కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పత్రికా ప్రకటనలు, మీడియాలో ప్రచురించడానికి మీడియా సర్టిఫికేషన్ – మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రచార ప్రకటనలు, చెల్లింపు వార్తలను పర్యవేక్షించడానికి కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో జిల్లా ఎన్నికల అధికారి చైర్మన్‌గా, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ ఏఆర్వో, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, సోషల్ మీడియా నిపుణులుగా ప్రసార భారతి సీనియర్ రిపోర్టర్ కె.నవీన్‌కుమార్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వశాఖ క్షేత్ర ప్రచార అధికారి రమేష్‌చంద్ర, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి వెంకటేశ్వరప్రసాద్ సభ్యులుగా ఉంటారన్నారు. రాజకీయ ప్రకటనలు కమిటీ ధ్రువీకరించిన తర్వాతే ప్రచారం చేయాల్సి ఉందని స్పష్టం చేశారు.

దాతల సాయం అభినందనీయం



చల్లపల్లి: పేద విద్యార్థినులకు దాతల సాయం అభినందనీయమని ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్ పెద్దలు ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్లో శనివారం సాయంత్రం అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా స్థిరపడిన చల్లపల్లి మండలం యార్లగడ్డకు చెందిన ఎస్.కుమార్–ఎనిగళ్ల అనిత దంపతులు రూ.3.50 లక్షలతో 50 మంది పేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు ఇచ్చారు. దాతలు మాట్లాడుతూ బస్ సౌకర్యం లేని దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థినులకు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.సుదర్శనధరప్రసాద్, ఇన్‌చార్జి తుమ్మల రేణు ప్రసాద్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పాలకాయతిప్ప మెరైన్ సీఐగా మోహన్‌రెడ్డి



కోడూరు: పాలకాయతిప్ప మెరైన్ స్టేషన్ సీఐగా మోహన్‌రెడ్డి శనివారం విధుల్లో చేరారు. ఇక్కడ సీఐగా ఉన్న వల్లభనేని పవన్‌కిషోర్ సూర్యలంక మెరైన్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. విధుల్లో చేరిన మోహన్‌రెడ్డి స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇక్కడ సముద్ర తీరం పరిస్థితి, మత్స్యకారులు, బోట్ల వివరాలపై ఆరా తీశారు. తీరం వెంట పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయనున్నట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా కాశీవిశ్వేశ్వరుడి కల్యాణం

కోడూరు: హంసలదీవిలోని అన్నపూర్ణ, బాలాత్రిపుర సుందరీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముత్యాల పందరిలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణతంతు జరిగింది. గుంటూరు జిల్లా అనంతవరానికి చెందిన కుప్పా వంశీయులు ఉభయదాతలుగా వ్యవహరించారు. బాలాత్రిపురసుందరి అలంకారం ఆకట్టుకుంది.

తిరుపతమ్మకు ప్రత్యేక పూజలు

కోడూరు: దింటిమెరక సమీపంలోని 17వ నెంబర్ పంటకాలువ పక్కనే ఉన్న లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం వద్ద స్వామివార్ల కల్యాణాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. మాఘశుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని గోపయ్య– తిరుపతమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నక్కవానిదారి గ్రామానికి చెందిన దాసరి బసవ మాణిక్యాలరావు దంపతులు కల్యాణాన్ని జరిపించారు. మహిళలు పాలపొంగళ్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తిభావం చాటుకున్నారు. కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు పెదప్రోలులో సచివాలయం ప్రారంభం

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ఉదయం 8.30 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో కె. శ్రీనివాసరావు తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు... 46 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

కేయూలో ప్రాంగణ ఎంపికలు

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం పర్యవేక్షణలో కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. బాబూరెడ్డి పర్యవేక్షణలో నలంద విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 30 మంది ఉత్తీర్ణులయ్యారు. మౌఖిక పరీక్షల్లో 15 మందిని ఎంపికచేశారు. కేయూ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సమన్వయకర్త కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి జ్యోతిర్మహోత్సవాలు

గూడూరు: కప్పలదొడ్డిలో చౌడేశ్వరిదేవి జ్యోతిర్మహోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. దాదాపు ఏడేళ్ల తర్వాత గ్రామంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి దేవాంగ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బూసం నాగబోతురావు, నాగబసవేశ్వరి దంపతులు నగరోత్సవాన్ని ప్రారంభించారు. దేవాంగ భక్తులు అలుగు సేవ చేశారు. వైఎస్సార్‌సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.2.50 కోట్లతో 'ఇండోర్' నిర్మాణం

- బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ కోర్టులకు ఏర్పాట్లు
- చకచకా పనులు





మచిలీపట్నంలో నిర్మాణ దశలో ఉన్న ఇండోర్ స్టేడియంలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి రెండు ఇండోర్ స్టేడియంలు అందుబాటులోకి రానున్నాయి. క్రీడలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. దీనిలో భాగంగా నగరంలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బంగళా ముందు ఉన్న స్థలంలో ఇండోర్ స్టేడియంల నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. వీటిలో ఒకటి చాలా వరకు పూర్తవగా, మరొకటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

రూ. 2.50 కోట్లతో పనులు

దాదాపు రెండు ఎకరాల స్థలంలో ఇండోర్ స్టేడియంల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శాప్ నిధులు రూ. 2.50 కోట్లతో రెండు బాస్కెట్‌బాల్, రెండు టెన్నిస్, నాలుగు షటిల్ ఇండోర్ స్టేడియంలు నిర్మిస్తున్నారు. వీటిలోనే మ్యాట్ వేసి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు రెండు రూమ్‌లు, కార్యాలయం కూడా నిర్మించారు.

ఎమ్మెల్యే పేర్ని నాని చొరవతో..

మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), ఆయన తనయుడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ప్రత్యేక చొరవతో నగరంలో ఇండోర్ స్టేడియం మంజూరైంది. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి పేర్ని కిట్టుకు ఉన్న సత్సంబంధాలతో ఈ నిధులు సేకరించారు. క్రీడలపై మక్కువ ఉన్నా సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ఈ ప్రాంత క్రీడాకారులకు ఈ ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగపడనుంది.

నాడు హామీలతోనే కాలయాపన చేసిన టీడీపీ

మచిలీపట్నంలో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామని టీడీపీ ఐదేళ్ల పాలనలో నాయకులు కాలయాపన చేశారు. కుమ్మరిగూడెం ప్రాంతంలో నిర్మిస్తామని కొన్నాళ్లు ప్రచారం చేశారు. 2019 ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో గోసంఘం వద్ద ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మాజీ క్రికెటర్ అనిల్‌కుంబ్లేతో శంకుస్థాపన చేయించారు. స్టేడియం నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. స్టేడియం నిర్మాణం ప్రచారానికే వాడుకున్నారే తప్ప టీడీపీ నాయకులు నిర్మాణం కోసం ఒక్క ఇటుకనైనా పేర్చలేదని నగరవాసులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ హయాంలో స్టేడియం ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ



బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పేర్ని నాని తదితరులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) శనివారం ఆవిష్కరించారు. ఆలిండియా ఎస్సీ, ఎస్టీ అండ్ ఎస్‌బీ ఎల్ఐసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మచిలీపట్నం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఎమ్మెల్యే పేర్ని నాని ఆవిష్కరించారు. కొనసాగిస్తాం అంబేడ్కర్ ఆశయాలను అంటూ ఎమ్మెల్యే నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు (జాని), మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డి.ఆశాలత, కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసి, వైద్యుడు హనుమంతయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, కార్పొరేటర్లు యండ్రపాటి నాగేశ్వరరావు, మిరియాల బసవపూర్ణమ్మ, మాజీ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ శరత్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు గరికిపాటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చెల్లె శోభన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటూరు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బ్యాంకులకు దీటుగా కేడీసీసీబీ సేవలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి



కేడీసీసీబీ బ్రాంచి నూతన భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సింహాద్రి రమేష్, పద్మావతి

నాగాయలంక: జాతీయ బ్యాంకులకు దీటుగా కృష్ణాజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు సేవలను అందిస్తోందని కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. మండలంలో పర్యటించిన వారు నాగాయలంకలో రూ.1.06 కోట్ల నిధులతో నిర్మించిన కేడీసీసీబీ బ్రాంచి నూతన భవనాన్ని, దీవుల్లోని ఎదురుమొండిలో రూ.28 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ నూతన భవనాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పద్మావతి కలసి శనివారం ప్రారంభించారు. నాగాయలంకలో బ్యాంకు సీఈఓ ఎ.శ్యామ్ మనోహర్ అధ్యక్షతన జరిగిన సభలో చైర్మన్ పద్మావతి మాట్లాడుతూ రూ.170కోట్లు టర్నోవర్‌తో తమ బ్యాంకు అన్ని రకాల సేవలు అందిస్తూ ప్రజలకు మరింత చేరువ కాగలిగామన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ రూ.11.45కోట్లతో నియోజకవర్గం పరిధిలో నూతన సహకార భవనాలు, ఇతర మౌలిక సదుపాయాలు చేకూర్చామన్నారు. డీసీఎంఎస్ పర్సన్ రేమాల సుబ్బారావు(బెనర్జీ), కేడీసీసీబీ డైరెక్టర్ జి.పెదవెంకయ్య, నియోజకవర్గం నేత సింహాద్రి వికాస్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, వివిధ పీఏసీఎస్‌ల అధ్యక్షులు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు(నాగాయలంక), కన్నా రామ్మోహన్ రావు(ఎదురుమొండి), తోట సాయిబాబు(బర్రంకుల), బ్యాంకు స్థానిక బ్రాంచి చీఫ్ మేనేజర్ చింతపూడి మధుబాబు, మోకా నాగప్రసాద్, బీసా బత్తుని ప్రసాద్, ఆకుల బాబీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రాష్ట్రాభివృద్ధి



చల్లపల్లిలో డ్రైనేజీ శాఖ సబ్ డివిజన్ కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో శనివారం రూ.19.98 లక్షల నిధులతో నిర్మించిన చల్లపల్లి స్పెషల్ డ్రైనేజీ శాఖ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రతి గ్రామంలో రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించడంతోపాటు, కేడీసీసీ బ్యాంకులు, పీఏసీఎస్ భవనాలు, వ్యవసాయ గిడ్డంగులు నిర్మించి గ్రామాల్లో ప్రజలకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు టీడీపీ ప్రభుత్వంలో శిథిలావస్థకు చేరిన భవనాలను చంద్రబాబు నిర్లక్ష్యం చేస్తే జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతగా నూతన భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నేత సింహాద్రి వికాస్ బాబు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, డ్రైనేజీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.విజయలక్ష్మి, డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, డ్రైనేజీ శాఖ ఏఈఈలు పానుగుమాటి చిరంజీవి, అబ్దుల్ కరీం, వీఎస్వీ రాంకుమార్, ఇరిగేషన్ ఏఈఈ రవితేజ, ఏఈ విజయ్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శీరం వెంకట సత్యనారాయణ (నాని), సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో గోదాముల పరిశీలన



పెడన: స్థానిక మార్కెట్ యార్డులోని గోదాములను పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ముడా వైస్ చైర్మన్ పి.వెంకటరమణ శనివారం రాత్రి పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెడనలోని 216 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఈవీఎంలతో పాటు ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరచడానికి, పంపిణీ చేయడానికి అనుకూలమైన గోదాములు ఉన్నది లేనిదీ పరిశీలించి ఆ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు ఈఆర్వో తెలిపారు. ఆయా గోదాములను మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ చారుమతి భర్త గరికపాటి వెంకటరామానాయుడు, యూడీసీ యశ్వంత్, కార్యదర్శి మురళీకృష్ణలు ఈఆర్వోకు చూపించడమే కాకుండా పలు విషయాలను తెలియజేశారు. పెడన తహసీల్దారు కె.రాంబాబు, సర్వేయర్ కృష్ణ, ఆర్ఐ మణికుమార్ తదితర సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యవ్రతాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేట దత్తాశ్రమంలో మాఘమాస పూజ కార్యక్రమాల్లో భాగంగా శనివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నగర వీధుల్లో రథోత్సవం కనులపండువగా నిర్వహించారు.

ఉప్పాల రాంప్రసాద్ విగ్రహం ఏర్పాటుకు ఆమోదం

కౌన్సిల్ అత్యవసర సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి

పెడన: పేదల పక్షపాతి, పెడనతో పాటు మండలాభివృద్ధికి పాటుపడిన ఉప్పాల రాంప్రసాద్ విగ్రహం ఏర్పాటుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శనివారం పెడన పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో అజెండాలోని 27 అంశాలపై చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగం నిర్వహణ ఖర్చులు, రెవెన్యూ విభాగం ఖర్చులు 2024–25 సంవత్సర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు తదితర వాటిని ఆమోదించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, సభ్యుల గౌరవవేతనాలు, కౌన్సిల్ సమావేశాలకు నిధుల కేటాయింపులతో పాటు వివిధ పద్దుల కింద కేటాయించిన నిధుల తీర్మానాన్ని ఆమోదించారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.40లక్షలతో వివిధ అభివృద్ధి పనుల టెండర్లు పిలిచి పనులు అప్పగించేలా ఆమోదం తెలిపారు. ఉప్పాల రాంప్రసాద్ విగ్రహాన్ని బంటుమిల్లి రోడ్డు సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం పక్కన ఏర్పాటు చేసే అంశంపై టీడీపీ, జనసేన సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, కౌన్సిలర్ కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్, ఇన్‌చార్జి కమిషనర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో నాయకత్వ లక్షణాలు

కేయూ ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి



మాట్లాడుతున్న వీసీ జ్ఞానమణి

కోనేరుసెంటర్: ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవచ్చని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జ్ఞానమణి తెలిపారు. జాతీయ సేవా శిబిరం ఆధ్వర్యంలో యువ సంవదక్ ఇండియా 2047 కార్యక్రమంలో భాగంగా కేయూలో శనివారం నిర్వహించిన సభలో ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ 1972వ సంవత్సరం నుంచి నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారని, ఇప్పుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకొత్త కార్యక్రమం తీసుకోవడం, ప్రజలకు ఉపయోగపడేలా ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సిలికాన్ ఆంధ్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కూచిభోట్ల ఆనంద్ మాట్లాడుతూ అమెరికాలో రెండేళ్ల ఎంఎస్ కంప్యూటర్స్ చేయడానికి ముందుకు వస్తే సిలికాన్ ఆంధ్రా ఫౌండేషన్ తరుపున అన్ని ఏర్పాట్లు చేస్తామని సభాముఖంగా హామీ ఇచ్చారు. సెంటైజన్ టెక్నాలజీస్ సీఈఓ వంశీ కొట్టే, వాణి స్వీట్స్ ఎండీ పల్లపోతు దిలీప్ తదితరులు ప్రసంగించారు. ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త ఎ శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.వీర బ్రహ్మచారి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందర కృష్ణా, డాక్టర్ లక్ష్మీకాంత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు స్వరూప, కవిత తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా పోతురాజు ఘటాల ఊరేగింపు

నాగాయలంక: బోసుబొమ్మ సెంటర్‌లోని శ్రీపోతురాజుస్వామి దేవస్థానంలో వార్షిక జాతర మహోత్సవానికి కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీకారం చుట్టారు. జాతర సంప్రదాయాలకు అనుగుణంగా స్వామి వారి ఘటాలను కృష్ణా నదిలో రజక పూజారులు శుద్ధిచేసి ప్రత్యేక పూజలు, జాతర సంప్రదాయ విన్యాసాలు జరిపారు. తొలుత గత ఏడాది జాతర అనంతరం భద్రపర్చిన స్థానిక అంకమ్మ దేవర ఆలయం నుంచి ఘటాలను బయటకుతీసి తూర్పు బజారు మీదుగా ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా కృష్ణానదికి తీసుకెళ్లారు. నదీజలంతో శుద్ధి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఘటాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునకు ఘటాలు గుడికి చేరుకోవడంతో పల్నాటి ఆచారవంతులతో సంప్రదాయరీతిలో గుడి వద్ద సంబరం జరుగుతుంది. తర్వాత భక్తులు మొక్కుబడులు చెల్లించుకుంటారని నిర్వాహక కమిటీ ప్రతినిధులు తలశిల బాలకృష్ణ, ఉప్పల లీలా కృష్ణప్రసాద్(బుజ్జి) చెప్పారు. ఆదివారం ఉదయం 11గంటల నుంచి సాయంత్రం వరకు అన్న సమారాధన చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

వెల్లివిరిసిన సేవాభావం

సింధు స్నాన భక్తులకు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు



అన్నపూర్ణ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నసమారాధన

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో సింధు స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తుల పట్ల పలు స్వచ్ఛంద సంస్థలు సేవాభావం చాటాయి. కోడూరుకు చెందిన అన్నం అన్నపూర్ణమ్మ చారిట్రబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వేల మందికి భోజనం, మంచినీటి ప్యాకెట్లను అందించారు.

-విజయవాడకు చెందిన వ్యాపారి ఆతుకూరి గాంధీ,హేమలత దంపతులు వేణుగోపాలుడి ఆలయ సమీపంలో 10వేల మందికి అల్పాహారం, అన్నసమారాధన చేశారు.

-హంసలదీవి ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద విజయవాడకు చెందిన పోతురాజు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఐదు వేల మందికి అల్పాహారం, మంచినీటి ప్యాకెట్లను అందించారు.

-ఉల్లిపాలెం గ్రామస్తులు వేణుగోపాలుడి ఆలయంలో తొమ్మిది వేల మందికి బెల్లం పానకాన్ని అందించారు.

-కోడూరుకు చెందిన వ్యాపారి అరజా ఉమామహేశ్వరరావు రెండు వేల మంది భక్తులకు అల్పాహారం అందించారు.

-సత్యసాయి సేవా సమాజం సభ్యులు భక్తుల వస్తువులు, సామగ్రిని భద్రపర్చేందుకు ప్రత్యేక స్టాల్‌ను ఉచితంగా ఏర్పాటు చేశారు.

పేదల సంక్షేమమే జగనన్న ధ్యేయం

వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము



సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేస్తున్న ఎంపీపీ, రాము తదితరులు

బంటుమిల్లి: పేదల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని నవరత్న పథకాలను వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ పెడన్ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. చోరంపూడి గ్రామంలో శనివారం వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఆధ్వర్యంలో ప్రజాదీవెన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో రాము ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పొన్నమండ రామకృష్ణ, పొన్నమండ వెంకటేశ్వరమ్మలను వారి స్వగృహంలో కలిసి పార్టీ గెలుపునకు కృషి చేయాలంటూ వారితో రాము మాట్లాడారు. అక్కడ జరిగిన శంకుస్థాపన కార్యక్రమాల్లో రామకృష్ణతో కలిసి రాము పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో అభివృద్ధి పనులు

గ్రామంలో అంతర్గత రోడ్లకు, ఫిల్టరు బెడ్ల మరమ్మతులకు ఎంపీపీ వి. చినబాబు, ఎంపీటీసీ సభ్యురాలు తిరుమలశెట్టి లక్ష్మితో కలిసి రాము భూమి పూజలు చేయించారు. జిల్లా పరిషత్ నిధుల నుంచి అంతర్గత రోడ్లకు రూ. 10 లక్షలు, రక్షిత మంచినీటి పథకం ఫిల్టరు బెడ్ల మరమ్మతులకు రూ. 5 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎస్. మహేష్, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పి. బాబూరావు, సర్పంచ్ బి. చంద్రశేఖర్, ఎంపీటీసీలు పి. వెంకటేశ్వరరావు, ఎండీ కమాల్‌బాషా, పి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం..

కనులపండువగా హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం



కల్యాణమూర్తులు

కోడూరు: పున్నమి వెన్నల కాంతుల్లో.. వేదపండితుల మంత్రోచ్ఛరణలు.. పూల పరిమళాలతో అలంకరించిన కల్యాణ వేదికపై హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం వైభవోపేతంగా సాగింది. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహోత్సవాల్లో శుక్రవారం రాత్రి స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించారు. వేణుగోపాలుడి ఆలయాన్ని కర్నాటకలోని శృంగేరీ పీఠం దత్తత తీసుకోవడంతో ఈ ఏడాది కల్యాణమూర్తులకు పీఠం తరుపున తిరుమల తిరుపతి వేదపాఠశాల ప్రిన్సిపాల్, ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివార్లను గజవాహనంపై ఊరేగించారు. గుంటూరు జిల్లా అనంతవరానికి చెందిన కుప్పా రామగోపాల స్వామియాజీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించగా, వేదపండితులు దివి శ్రీరంగాచార్యులు, నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు స్వామివారు, అమ్మవార్ల గుణగణాలను వివరిస్తూ అనుగ్రహభాషణ చేశారు. ముందుగా జగజ్యోతి కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మాఘ పౌర్ణమి పుణ్యస్నానాల సందడి



కోనేరుసెంటర్: మంగినపూడి బీచ్‌లో శనివారం భక్తులు మాఘ పౌర్ణమి పుణ్యస్నానాలను ఆచరించారు. తెల్లవారుజామునే బీచ్‌కి చేరుకున్న భక్తులు సముద్రపు ఒడ్డున ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం దత్తాశ్రమంలోని 11 బావుల్లో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

సాగరసంగమం వద్ద భక్తుల జల్లుస్నానాలు

కోడూరు: కృష్ణమ్మ సముద్రంలో కలిసే పవిత్ర కృష్ణా సాగరసంగమ ప్రాంతం వద్ద భక్తుల కోసం అధికారులు జల్లుస్నానాలను ఏర్పాటు చేశారు. సంగమం వద్ద పర్యాటకుల భద్రతా దృష్ట్యా జల్లుస్నానాలకు శ్రీకారం చుట్టారు. శనివారం సింధుస్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులు ఈ జల్లుస్నానాల అనుభూతిని ఆస్వాదించారు. సంగమం వద్ద ఉన్న కృష్ణమ్మ అమ్మవారి విగ్రహం, పాదాలు నూతన శోభ సంతరించుకున్నాయి.